క్లుప్తంగా

నేడు జ్యోతుల ఉత్సవం



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని ఆర్. రంగాపురంలో శనివారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామానికి తీసుకువెళ్లి పట్టం కూర్చోబెట్టారు. జ్యోతుల ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

రేపు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

గుడిబండ: అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలవడానికి వైఎస్సార్‌సీపీ రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఓ ప్రకటనలో తెలిపారు. నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరుకావాలని కోరారు.

సీజేఐపై దాడికి యత్నించడం హేయం



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

హిందూపురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమని, వెంటనే న్యాయవాది రాకేష్ కిశోర్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థకు దేశం మొత్తం అండగా నిలబడాల్సిన తరుణం ఇది అన్నారు. నాయకులు సుబ్బరాయప్ప, కొండప్ప, శివకుమార్, కుమార్, మౌలాలి, బాబు, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



షబ్బీర్‌బాషా (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని కాకి గ్రామానికి చెందిన షబ్బీర్‌బాషా (63) అదృశ్యమైనట్లు ఆయన భార్య షంషాద్‌బీ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ ఇదాయతుల్లా తెలిపారు. ఈనెల 6న రాత్రి భోజనం చేసిన తర్వాత మళ్లీ ఇంటికి రాలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎంపీడీఓపై కేసు నమోదు చేయండి

చిలమత్తూరు: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న రమణమూర్తి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఓ పత్రికకు చెందిన విలేకరితో ఫోన్‌లో సంభాషిస్తూ మండల విలేకరులను అసభ్యంగా మాట్లాడారు. వారి సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఎంపీడీఓ రమణమూర్తి అనుచిత వాఖ్యలపై జర్నలిస్ట్ సంఘాల నేతలు మండిపడ్డారు. ఎంపీడీఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల విలేకరుల సంఘం ఆధ్వర్యంలో చిలమత్తూరు పీఎస్‌లో ఎంపీడీఓపై కేసు నమోదు చేయాలని ఎస్ఐ మునీర్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు.

మద్యం శ్యాంపిల్స్ సేకరణ



మద్యంషాపులో శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం టౌన్: ఎవరైనా కల్తీ కల్లు, మద్యం అమ్మిన తయారు చేసి నిల్వ చేసినా అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేసి, మద్యం శ్యాంపిల్స్‌ను సేకరించి కెమికల్ ల్యాబ్‌కు పంపారు. అలాగే కల్లు దుకాణాలు కల్లు శ్యాంపిల్స్ సేకరించారు. అలాగే మండలంలోని మలుగూరు రైల్వేగేట్ సమీపంలో ఒక వ్యక్తి వద్ద కేరళకు సంబంధించిన 8 మద్యం బాటిళ్లు ఉండటంతో అతనిపై కేసు నమోదు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలియజేశారు.

కాంట్రాక్టర్‌పై అనర్హత వేయండి

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన కాంట్రాక్టర్ ప్రభాకర్‌పై భవిష్యత్‌లో మున్సిపల్ టెండర్లలో పాల్గొనకుండా అనర్హత వేటు వేయాలని న్యాయవాది గోవిందరాజులు శుక్రవారం హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమీషనర్‌కు వినతి పత్రం అందించారు.

నష్టాల బాటలో ఉల్లి రైతులు

- మద్దతు ధర కల్పించని కూటమి ప్రభుత్వం
- పెట్టుబడి కూడా దక్కడం లేదని అన్నదాతల ఆవేదన



తడకలపల్లి వద్ద ఆరబెట్టిన ఉల్లి

మడకశిరరూరల్: ఉల్లి రైతులు నష్టాల బాట పట్టారు. మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రైతులు బోరు బావుల కింద 260 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. ఎకరా ఉల్లి పంట సాగుకు, ఎరువులు, కూలీలకు దాదాపు రూ.50 వేల వరకు ఖర్చు పెట్టారు. అయితే పంట దిగుబడి బాగా వచ్చినా మార్కెట్‌లో మద్దతు ధర లేక, ఇంట్లో నిల్వ ఉంచుకోలేక వ్యాపారస్తులు అడిగిన ధరకే రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. క్వింటాల్ ఉల్లి రూ.300– 350 వరకు వ్యాపారస్తులు అడుగుతున్నారని, ఆ ధరకు విక్రయిస్తే పంటసాగుకు పెట్టిన పెట్టుబడి కుడా చేతికి అందదని వాపోతున్నారు. గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, కనీసం ఇప్పటికైనా ఉల్లి రైతుల కష్టాలను గుర్తించి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

పెట్టుబడి కూడా దక్కడం కష్టమే



ఉల్లి పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం కష్టంగా ఉంది. బోరు కింద అప్పులు చేసి రెండు ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట దిగుబడి బాగా వచ్చింది. పంట సాగు నుంచి తొలగింపు వరకు రూ.1.30 లక్షలు ఖర్చు అయింది. ఉల్లి నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.300–400 వరకు వ్యాపారస్తులు అడుగుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి కూడా దక్కదు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి. – గోపాల్‌రెడ్డి, రైతు, మడకశిర మండలం

ఉల్లి రైతులను ఆదుకోవాలి



అప్పులు చేసి సాగు చేసి పండించిన ఉల్లికి సరైన మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి అండగా నిలించింది. కానీ కూటమి ప్రభుత్వంలో అలాంటి భరోసా రైతులకు కనిపించడం లేదన్నారు. – ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

కోటి సంతకాల సేకరణ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్, టీఎన్ దీపిక తదితరులు

చిలమత్తూరు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం వైద్య విద్య, పేద ప్రజల కోసం కార్పొరేట్ వైద్యం అందించాలని సంకల్పించి జిల్లాకో మెడికల్ కళాశాల కట్టించాలని సంకల్పించి అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆరు మెడికల్ కళాశాలలను కూడా పూర్తి చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేస్తోందని, చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాలు సేకరించి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపేలా వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఈ సంతకాల ఉద్యమంలో పాల్గొంచుకోవాలని పిలుపునిచ్చారు.

మానసిక వికలాంగుల్లో ధైర్యం నింపాలి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం: మానసిక వికలాంగుల్లో ధైర్యం నింపి సమాజంలో ధైర్యంగా జీవించేస్థాయికి వారిలో మార్పును తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి డీ వెంకటేశ్వర్లునాయక్, ప్రభుత్వాస్పత్రి సూపరిండెంటెంట్ అన్నపూర్ణ, మానసిక వైద్య నిపుణులు రాజగోపాల్, జీవన పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ మానసిక వికలాంగుల ఆరోగ్య పరిస్థితులను చక్కబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో విభిన్న పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం, పొగాకు తదితర వాటికి బానిసలై చాలామందిని తొలుత కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తర్వాత మందుల వాడకాన్ని అమలు చేస్తువారిలో మార్పుకు శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు.

బిల్లుల కోసం సర్పంచుల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన సర్పంచ్‌లు

సోమందేపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సర్పంచ్‌లు ఆందోళన చేపట్టారు. మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సర్పంచులు అంజినాయక్, జిలాన్‌ఖాన్, కిష్టప్ప, పరంధామ, లలితమ్మ, గంగాదేవి, రామాంజినేయులు మాట్లాడుతూ రాజకీయ వివక్షతో అధికార పార్టీ నాయకులు మాట విని అధికారులు తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరసింగరావుకు తెలిపి వెళ్లిపోయారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లు చెల్లించే వరకు తాము సమావేశానికి హాజరు అయ్యేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీపీ గంగమ్మ వారి వద్దకు చేరుకొని ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మతో ఫోన్ ద్వారా మాట్లాడారు. వచ్చే వారం బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సర్పంచ్‌లు ఆందోళన విరమించారు. సమావేశం వద్దకు కొందరు టీడీపీ నాయకులు చేరుకొని సర్పంచ్‌ల ఆందోళనను వ్యతిరేకించి కించపరిచేలా కవ్వింపు చర్యలకు దిగారు. ఉద్రిక్తత ఏర్పడటంతో ఎస్ఐలు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు చేరుకొని బందోబస్తు నడుమ సమావేశం నిర్వహించారు.

9 మందికి రిమాండ్

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని వెంకటగిరి పాళ్యం గ్రామంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో తొమ్మిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు కియా ఎస్ఐ రాజేష్ తెలిపారు. వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన తొమ్మిది మంది అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మల్లికార్జున, ఓబిలేసు, గజేంద్ర, మంజునాథ్, చంద్రశేఖర్, చిన్న ఆంజనేయులు, శంకరయ్య, రవి, చెన్నేకొత్తపల్లికి చెందిన రామాంజినేయులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి రిమాండ్ విధించారన్నారు.

సీఈసీ సభ్యుడు తిప్పేస్వామికి సన్మానం



మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరులో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే , వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామిని నాయకులు శాలువా పూలమాలతో సన్మానించారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, నాయకులు శివకుమార్, తిమ్మన్న, శివలింగ తదితరులు ఉన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

సత్తాచాటిన అరసికెర క్రీడాకారులు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాలూకా స్థాయి ఖోఖో పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయికి చేరుకున్నారు. పట్టణంలోని మహాత్మ గాంధీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందారు. అలాగే శనివారం కొరటగెరెలో జరిగే జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రేణుకా రాజ్, సహోపాధ్యాయుడు హనుమేశ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు విమల తదితర ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

12న బంజారా సభ

సోమందేపల్లి: పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి వద్ద ఈ నెల 12న అఖిల బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం సోమందేపల్లిలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు.

అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా సుబ్రహ్మణ్యం



మడకశిర: మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలు సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని సీఐ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

విద్యా ప్రాంగణాల్లోకి అడవి పందులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల గది వెనుక భాగంలో బురదలో ఉన్న అడవి పందులు



బోయగేరిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న ముళ్ల పొదలు

- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

పెనుకొండ: పట్టణంలోని బోయగేరిలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద పాఠశాలకు ఆనుకుని ముళ్ల పొదలల్లున్నాయి. దీంతో అడవి పందులు పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్నాయి. ఆ ప్రాంతంలో పారబోసిన ఆహార పదార్థాలను తిని తాపీగా మళ్లీ పొదల్లోకి చేరుకుంటున్నాయి. ప్రహరీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంతంలో మురుగు నీరు నిల్వ ఉండడంతో అడవి పందులు సమీపంలోని ముళ్ల పొదల్లో ఉంటూ హల్‌చల్ చేస్తున్నాయి. అడవి పందులు ఏకంగా విద్యా ప్రాంగణాల్లోకి వస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరబాటున విద్యార్థులపై దాడి చేస్తే పరిస్థితేంటని ప్రశ్నిస్తున్నారు. ఏ ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త పాలకవర్గం ఎన్నికయ్యే వరకూ బిల్లులు చేయొద్దు



సర్వసభ్య సమావేశంలో బిల్లులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్న సభ్యులు

రొళ్ల: 'అవిశ్వాసం తీర్మానానికి మూడు రోజుల క్రితమే అధికారులకు వినతిపత్రం అందించాం. కొత్త పాలక వర్గం ఎన్నికయ్యే వరకు బిల్లులు చెల్లింపులు, పనులు చేపట్టకూడదు' అని 8 మంది ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తమకు తెలియకుండా ఇతరులకు పనులు కేటాయించి తీరని అన్యాయం ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ నాగరాజు, ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రిపై మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు మొదట్లో మినిట్స్ పుస్తకంలో సంతకాలు చేశారు.సమావేశం ముగింపు సమయంలో సభ్యుల నుంచి సంతకాలు తీసుకోవాల్సి ఉండగా మొదట్లోనే ఎలా తీసుకుంటారని సభ్యులు ఎంపీడీఓను ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే సభ్యులు, అధికారుల నుంచి సంతకాలు తీసుకోవాల్సి ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం ప్రారంభంలోనే సమావేశం జరగకుండా అక్కడి నుంచి అధికారులు, సభ్యులు వెళ్లిపోయారు. మినిట్స్ పుస్తకాలను ఎంపీపీ తన వెంట తీసుకోవడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి: మండలంలో పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పరిగి టౌన్, బోరెడ్డిపల్లి, చిన్నపల్లి, హొన్నంపల్లి, శిరేకోలం, కాలువపల్లి, నేతులపల్లి, దాసరిపల్లి, సుబ్బరాయనిపల్లి, శాసనకోట, నేతులపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి, రొళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటలకు నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నిజాముద్దీన్ ప్రకటనలో తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం రోడ్డులోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించిన తర్వాత వంటగది, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంపై ఆరా తీశారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

హిందూపురం: మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఖరీఫ్ 2025 పంట కోత ప్రయోగాలపై సహాయ గణాంక అధికారి వల్లినాథ్‌రావు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్లాట్, సర్వే నంబర్లను ఎంపిక చేసి ప్లాట్ సెలక్షన్ గురించి వివరించారు. శుక్రవారం మండంలోని కగ్గల్లులో కంది పంటలో కూడా ప్లాట్ సెలక్షన్ చేసే విధానాన్ని చెప్పారు. ఏఓ సురేంద్రనాయక్ మాట్లాడుతూ ఈనెల 25 లోపు ఈ–పంట నమోదు ముగించి పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హర్టికల్చర్ అధికారి మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత ,ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీలో దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండలంలోని సేవామందిరం ఏపీఆర్ జేసీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన లెక్చరర్లుగా పనిచేయడానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రమీలమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటూ లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈక్రమంలో ఈనెల 13 వరకూ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 87126 25078 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

అమరాపురం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో ప్రహరీ, డిజిటల్ గ్రంథాలయ భవనం నిర్మాణానికి ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు శుక్రవారం భూమి పూజ చేశారు. అలాగే స్థానిక బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

బోధనేతర పనులు అప్పగించొద్దు



ఎంఈఓ గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోరంట్ల/పెనుకొండ: 'మితిమీరిన బోధనేతర పనులతో బోధనా సమయం హరించిపోతోంది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను అప్పగించవద్దు'అని ఫ్యాప్టో సంఘం మండల నాయకులు శుక్రవారం ఎంఈఓ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. మితిమీరిన బోధనేతర పనులతో ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోతుందన్నారు. మండలంలోని ఉపాధ్యాయులందరూ బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు వివరించారు. మరోవైపు పెనుకొండ పట్టణంలోనూ ఫ్యాప్టో నాయకులు ఎంఈఓ రాఘవయ్యకు వినతిపత్రం అందజేశారు. వెంకటరమణనాయక్, ఉపేంద్ర, రఘునాథ్, ఓబిలేసు, నబి తదితరులు పాల్గొన్నారు

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

చిలమత్తూరు: మండలంలోని యగ్నిశెట్టిపల్లికి చెందిన నంజుడప్ప (35) భార్య కాపురానికి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నంజుడప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కొద్దిరోజులుగా కాపురానికి రాకుండా పుట్టినింట్లో ఉంటోందని, దీతో మన మనస్తాపం చెంది నంజుడప్ప ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అయితే మృతుడి తండ్రి మాత్రం కోడలిపై అనుమానంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

పెనుకొండ: పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితరులు పాల్గొంటారన్నారు.

నిందితుడి అరెస్టు

రొద్దం: మండల పరిధిలోని సుబ్బరాయప్పకొట్టాల సమీపంలో పూజమ్మ దేవాలయంలో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. కడప జిల్లా ముకుందాపురానికి చెందిన నాగలూరు జానయ్య (28) ఆలయంలో చోరీ చేశాడని ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు. అతని వద్ద నుంచి రూ 85 వేలు విలువగల 406 గ్రాములు వెండి ఆభరణాలు, మూడు పెద్ద గొడుగులు, రెండు చిన్న గొడుగులు, వెండి మీసాలు, వెండి కనుబొమ్మలను స్వాధీనం చేసుకున్నామన్నారు. న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పేర్కొన్నారు.



గోరంట్ల: నీటితో కళకళలాడుతున్న పాలసముద్రం చెరువు



దుద్దేబండ వద్ద పారుతున్న వర్షపు నీరు

దంచికొట్టిన వాన



మరవకొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో నీరు నిలిచిన దృశ్యం

గోరంట్ల: గత రెండు రోజుల నుంచి మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పాలసముద్రం చెరువు నిండి మారువ పారుతోంది. అలగే మండలంలోని కమ్మలవాండ్లపల్లి , గౌనివారిపల్లి, వానవోలు, గంగంపల్లి, కరావులపల్లి, మల్లాపల్లి, కళ్లగేరి, బూదిలిపెద్ద చెరువుల్లోకి మోస్తరు వర్షపు నీరు వచ్చి చేరింది. చిత్రావతి నది ఎడతెరిపి లేకుండా ప్రహిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిలమత్తూరు: మండలంలో శుక్రవారం ఉదయం గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలల్లోకి నీరు వచ్చి చేరింది. రోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని మరవకొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలను బాగు చేయించాలని తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కోరారు. డ్రైన్‌లు సరిగా లేకపోవడంతో వర్షం దెబ్బతో మురుగునీరు ఎస్సీ కాలనీలోకి వస్తోందని , అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పెనుకొండ/పెనుకొండ రూరల్: పెనుకొండతో పాటు మండల వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి వర్షం దంచికొట్టింది. ఉదయం 10 గంటల వరకూ వర్షం కురుస్తూనే ఉండటంతో జనజీవనం స్తంభించింది. వర్షం ధాటికి పట్టణంలోని దర్గా సర్కిల్లో వర్షపు నీటితో రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. అలాగే షీఫారం వంకతో పాటు, తిమ్మాపురం వద్ద వంక పెద్దఎత్తున ప్రవహించింది. ముత్యాల చెరువు, ఎర్రమంచి చెరువులోకి భారీ ఎత్తున వర్షపు నీరు చేరింది. మండల వ్యాప్తంగా 9.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



పెనుకొండ సమీపంలోని షీఫారం వద్ద వంకలో ప్రవహిస్తున్న వర్షపు నీరు